కార్వాన్‌లో పుంజుకుంటున్న కాంగ్రెస్?

జంగ్ తెలంగాణ 2023

గోల్కొండ: కార్వాన్ నియోజకవర్గంలో కాంగ్రెస్ పుంజుకుంటుంది. ఎన్నికల షెడ్యూల్ వెలువడక ముందు నుంచే డివిజన్ల నాయకులు, కార్యకర్తల్లో ఎన్నికల సందడి నెలకొని ఆశావహులు కాంగ్రెస్ టికెట్ కోసం దరఖాస్తు చేసుకున్నారు. ముస్లిం ఓటర్లు అధికంగా ఉండే కార్వాన్ నియోజకవర్గంలో ఈసారి ఎలాగైనా గెలుస్తామని ధీమా వ్యక్తం చేస్తున్నారు. కాంగ్రెస్ ఎన్నికల మేనిఫెస్టోలో ప్రకటించిన ఆరు గ్యారంటీల పథకానికి సైతం ప్రజల్లో మంచి స్పందన వస్తుంది. ఇదిలా ఉండగా సిట్టింగ్ ఎమ్మెల్యేను వ్యతిరేకించే వారు గత్యంతరం లేక కాంగ్రెస్ జెండా పట్టుకున్నారు. మరోవైపు దళితులు, బీసీలు ఈసారి కాంగ్రెస్ వైపు మొగ్గు చూపుతున్నారు. ఉమ్మడి రాష్ట్రంలో కాంగ్రెస్‌కు పెట్టని కోటగా ఉన్న దళితులు, బీసీలలో చాలా మంది ఈసారి కాంగ్రెస్ వైపు మొగ్గు చూపే అవకాశం ఉంది. అయితే.. టికెట్ కేటాయింపు విషయమై ఓ వర్గం నాయకులు ఒక్కటవ్వగా అధిష్టానం మాత్రం గతంలో కార్వాన్ నుంచి పోటీ చేసిన వ్యక్తికి టికెట్ కేటాయించింది. ఏదేమైనా ఈ సారి కార్వాన్‌లో కాంగ్రెస్ ఊపుమీద ఉన్నట్లు రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

సీఎం కేసీఆర్ హ్యాట్రిక్ సాధించడం ఖాయం



మాట్లాడుతున్న రాథోడ్, సంతోష్‌గుప్తా, మమతా గుప్తా తదితరులు

అబిడ్స్: బీఆర్ఎస్ ప్రభుత్వం ఈ ఎన్నికల్లో మరోసారి విజయం సాధించి హ్యాట్రిక్ సాధించడం ఖాయమని మాజీ ఎమ్మెల్యే ప్రేమ్‌సింగ్ రాథోడ్, బీఆర్ఎస్ నాయకుడు సంతోష్‌గుప్తా, మమతా గుప్తా పేర్కొన్నారు. ఆదర్శ్‌నగర్‌లోని మాజీ కార్పొరేటర్ మమతాగుప్తా కార్యాలయంలో జరిగిన మీడియా సమావేశంలో వారు మాట్లాడారు. గతంలో మోదీ చెప్పిన విధంగా గోషామహల్‌లో కూడా డబుల్ ఇంజన్ అధికారంలోకి వస్తే అందరికీ లాభమని ఆయన అన్నారు. రాష్ట్రంలో బీఆర్ఎస్ ఉన్నప్పుడు గోషామహల్‌లో కూడా బీఆర్ఎస్ విజయం సాధిస్తేనే ప్రజలకు అన్ని విధాల లాభం ఉంటుందన్నారు. గోషామహల్ నియోజకవర్గం బీఆర్ఎస్ టికెట్ ఎవరికి ఇచ్చినా అందరం కలిసికట్టుగా ఉండి పనిచేసి గెలిపిస్తామన్నారు. టికెట్ ఖరారు చేసే విషయంలో తమతో సంప్రదించి ఇస్తే బావుంటుందని వారన్నారు. సీఎం కేసీఆర్, మంత్రి కేటీఆర్ సూచనల మేరకు అందరు కలిసికట్టుగా ఉండి టికెట్ ఇచ్చిన వారిని గెలిపించేందుకు కృషి చేస్తామన్నారు. కానీ ఒక్కసారైనా సీఎం కేసీఆర్, మంత్రి కేటీఆర్‌లతో తమకు కలిసే అవకాశం ఇస్తే తమ అభిప్రాయాలను కూడా తెలుపుతామని వెల్లడించారు. గోషామహల్ పదేళ్లుగా బీజేపీ ఎమ్మెల్యేగా గెలిచిన రాజాసింగ్ ఎలాంటి అభివృద్ధి చేయలేదన్నారు. కేవలం బీఆర్ఎస్ హయాంలోనే అభివృద్ధి జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు ఆల పురుషోత్తమ్‌రావు, రాంచంద్రరాజు, బెజిని శ్రీనివాస్, సురేష్ ముదిరాజ్, శాంతిదేవి, సతీష్‌కుమార్, బి.రమేష్ గుప్తా పాల్గొన్నారు.

'అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ క్లీన్ స్వీప్'



మంత్రి హరీష్‌రావుతో ఇమ్రాన్ అలీఖాన్

గోల్కొండ: వచ్చే అసెంబ్లీ ఎన్నికలను బీఆర్ఎస్ పార్టీ క్లీన్ స్వీప్ చేస్తుందని మంత్రి హరీష్‌రావు అన్నారు. బుధవారం కార్వాన్ నియోజకవర్గం బీఆర్ఎస్ యూత్ విభాగం నాయకుడు ఇమ్రాన్ అలీఖాన్ లడ్డూ మంత్రిని కలిశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. కాంగ్రెస్‌కు విజన్ లేదని అయినా కూడా ఆ పార్టీని ప్రజలు ఏనాడో తిరస్కరించారన్నారు. కేవలం తన ఉనికిని చాటుకోవడానికి మాత్రమే ఆ పార్టీ అధికారంలోకి వస్తామంటూ గొప్పలు చెప్పుకుంటుందన్నారు. బీఆర్ఎస్ యువజన విభాగం వారు తమ ప్రాంతపు బీఆర్ఎస్ అభ్యర్థిని గెలిపించేందుకు కలిసికట్టుగా పని చేయాలని సూచించారు.

'అత్యధిక స్థానాల్లో పోటీ చేసేందుకు సిద్ధం'

అఫ్జల్‌గంజ్: అసెంబ్లీ ఎన్నికల్లో అత్యధిక స్థానాల్లో పోటీ చేసేందుకు సిద్ధమవుతున్నామని ప్రజా ఏక్తా పార్టీ జాతీయ అధ్యక్షుడు బోనాల శ్రీనివాస్ అన్నారు. బుధవారం గౌలిగూడలోని పార్టీ కేంద్ర కార్యాలయంలో నాయకులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా 15 మందితో కూడిన మెదటి లిస్ట్‌ను ఆయన పార్టీ నాయకులతో కలిసి విడుదల చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ..ఉచిత వైద్య, ఉచిత విద్యకు మా పార్టీ అధిక ప్రాధాన్యత ఇస్తుందని తెలిపారు. మా పార్టీకి కేంద్ర ఎన్నికల సంఘం ప్రెషర్ కుక్కర్‌ను గుర్తుగా కేటాయించిందని వెల్లడించారు. తాను గోషామహల్ నియోజకవర్గం నుంచి పోటీలో చేస్తున్నానన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు ఎంకే నరేందర్, నరేశ్, దామోదర్ శర్మ, దేవ్‌రాజ్, రాజు తదితరులు పాల్గొన్నారు.



పార్టీ నాయకులతో కలిసి మెదటి లిస్ట్‌ను ప్రకటించిన బోనాల శ్రీనివాస్

'కాంగ్రెస్, బీజేపీల అబద్ధపు ప్రకటనలు ప్రజలు నమ్మరు'



కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న నందకిశోర్ వ్యాస్ బిలాల్ తదితరులు

అబిడ్స్: కాంగ్రెస్, బీజేపీలు ప్రజలను తప్పుదోవ పట్టించేందుకు అసత్యపు ప్రచారాలకు దిగాయని గోషామహల్ నియోజకవర్గం బీఆర్ఎస్ ఇన్‌చార్జ్ నందకిశోర్ వ్యాస్ బిలాల్ పేర్కొన్నారు. పదేళ్లుగా సీఎం కేసీఆర్ ప్రభుత్వం చేపట్టిన ప్రగతి, అభివృద్ధితో మరోసారి బీఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలోకి రావడం ఖాయమన్నారు. మంగళ్‌హాట్ డివిజన్ మైనార్టీ నాయకులు సీఎం కేసీఆర్ ప్రవేశపెట్టిన, మేనిఫెస్టో అద్భుతంగా ఉందని ఆయన చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా నందకిశోర్ వ్యాస్ బిలాల్ పాల్గొని పాలాభిషేకాన్ని ప్రారంభించి ప్రసంగించారు. మరోసారి ఓటమిపాలవుతామని గ్రహించిన కాంగ్రెస్, బీజేపీలు తప్పుదోవలోకి పోతున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో పప్పుమాత్రే, కోటి శైలేష్ కురుమ పాల్గొన్నారు.

మజ్లిస్ పార్టీకి ప్రజల మద్దతు



షేక్ రఫీక్‌తో ఎమ్మెల్యే కౌసర్

గోల్కొండ: మజ్లిస్ పార్టీకి ప్రజల మద్దతు, ఆశీర్వాదం మెడుగా ఉన్నాయని ఆ పార్టీ ఎమ్మెల్యే కౌసర్ మోహియుద్దీన్ అన్నారు. బుధవారం ఆయన కార్వాన్ నియోజకవర్గంలోని మోగల్‌కా నాలా, మొగల్‌నగర్ తదితర ప్రాంతాల్లో పర్యటించి ప్రజలను కలుకొని వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. చెత్త తరలింపునకు అదనపు యూనిట్లను నియమించడం జరిగిందని దీంతో చెత్త తరలింపు, చెత్త కుప్పలు పేరుకుపోవడం ఉండడం లేదని ఆయన అన్నారు. ప్రజల ఫిర్యాదులపై తాము ఎప్పటికప్పుడే స్పందిస్తామని ఏ చిన్న సమస్య ఉన్నా కూడా వెంటనే దానిని పరిష్కరించడం జరుగుతుందన్నారు. ఈ సందర్భంగా షేక్ రఫీక్, షేక్ అమీద్‌లు ఎమ్మెల్యేను గజమాలతో సత్కరించారు.

22న బీఆర్ఎస్ శిక్షణ శిబిరం



జియాగూడ: ఈనెల 22న బీఆర్ఎస్ బస్తీ కమిటీల సభ్యులకు శిక్షణా శిబిరం నిర్వహిస్తున్నట్లు కార్వాన్ బీఆర్ఎస్ అభ్యర్థి మిత్రకృష్ణ తెలిపారు. బుధవారం హోంమంత్రి మహమూద్ అలీని కలిసి ఆహ్వానించారు. అనంతరం మిత్రకృష్ణ మాట్లాడుతూ..కార్వాన్ నియోజకవర్గంలోని గుడిమల్కాపూర్ మోహిని ఫంక్షన్‌హాల్‌లో శిక్షణా శిబిరాన్ని నిర్వహిస్తున్నామన్నారు. ఉదయం 10 గంటల నుంచి శిబిరం ప్రారంభమవుతుందని తెలిపారు. ముఖ్యఅతిథిగా మంత్రి మహమూద్ అలీని ఆహ్వానించినట్లు పేర్కొన్నారు. బీఆర్ఎస్ విజయాన్ని ఏ శక్తి అడ్డుకోలేదని, ప్రతి బస్తీ నుంచి బీఆర్ఎస్ కమిటీలను ఏర్పాటు చేసి సీఎం కేసీఆర్ చేపట్టిన అభివృద్ధి సంక్షేమ పథకాలను వివరించడం జరుగుతుందన్నారు. బీఆర్ఎస్ నాయకుడు ఉమేష్ పాల్గొన్నారు.

నేడు రాజీవ్‌గాంధీ సద్భావన యాత్ర స్మారక దినోత్సవం

దూద్‌బౌలి: రాజీవ్‌గాంధీ సద్భావన యాత్ర స్మారక దినోత్సవాన్ని ఈనెల 19న చార్మినార్ వద్ద నిర్వహించనున్నట్లు రాజీవ్‌గాంధీ సద్భావన యాత్ర స్మారక కమిటీ చైర్మన్ జి.నిరంజన్ తెలిపారు. ప్రతి ఏటా నిర్వహిస్తున్నట్లుగానే ఈ ఏడాది కూడా నిర్వహిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి పాల్గొని జెండావిష్కరణ చేయనున్నారన్నారు. ఏఐసీసీ ఇన్‌చార్జి మానిక్‌రావు ఠాక్రేతో పాటు సీఎల్‌పీ నాయకులు మల్లు భట్టి విక్రమార్క తదితరులు పాల్గొంటారన్నారు.

క్లుప్తంగా...

పోటాపోటీగా 'టీపీజీఎల్'



గోల్కొండ: శ్రీనిధి యూనివర్సిటీ తెలంగాణ సీనియర్ గోల్ఫ్ లీగ్ పోటాపోటీగా జరుగుతోంది. గోల్కొండ నయాఖిలాలోని హైదరాబాద్ గోల్ఫ్ కోర్టులో జరుగుతున్న ఈ టోర్నీలో గోలర్లు తమ ప్రతిభను చాటుతున్నారు. 3వ రౌండ్‌లో లహరి లయన్స్ ఆటగాళ్లు వివేక్‌చంద్రశేఖర్, అక్రమ్‌ఖాన్, మణికాంత్, సంజయ్‌గడిపాటి అత్యుత్తమ ఆటతో తమ టీమ్ స్కోర్‌ను 15 పాయింట్లు చేశారు. అదే విధంగా ఎంవైకే టీమ్ 14.5 పాయింట్లతో రెండవ స్థానంలో కొనసాగుతోంది. ఈ టీమ్‌కు చెందిన ఆటగాళ్లు మంచి స్ట్రైక్‌తో తమ టీమ్ స్కోర్‌ను మెరుగు పరిచారు.

ఇండియన్ సైక్లింగ్ (పారా) టీంకు కోచ్‌గా దత్తాత్రేయ



చార్మినార్: ఈనెల 22 నుంచి 28 వరకు చైనాలో జరిగే ఏషియన్ పారా గేమ్స్–2022లో ఇండియా తరఫున ఆడే ఇండియన్ సైక్లింగ్ (పారా) టీంకు కోచ్‌గా పాతబస్తీకి చెందిన కె.దత్తాత్రేయ నియమితులయ్యారు. తెలంగాణ సైక్లింగ్ అసోసియేషన్ కార్యనిర్వాహక కార్యదర్శిగా కొనసాగుతున్న ఆయనను టీం కోచ్‌గా సైక్లింగ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా సెక్రటరీ జనరల్ మణిందర్ పాల్ నియమించారు. ఆయనతో పాటు ఆదిత్య మెహతా కూడా మరో కోచ్‌గా నియమితులైనట్లు తెలిపారు.

కేసీఆర్‌ను కలిసిన ఆశీష్‌కుమార్‌యాదవ్



అబిడ్స్: సీఎం కేసీఆర్‌ను గోషామహల్ నియోజకవర్గం బీఆర్ఎస్ నాయకులు ఆశీష్‌కుమార్ యాదవ్ కలిశారు. బుధవారం ప్రగతి భవన్‌లో కేసీఆర్‌ను కలిసి మొక్కను అందజేశారు. ఈ సందర్భంగా నియోజకవర్గంలో పార్టీ పటిష్టంగా ఉందని, బీఆర్ఎస్ విజయం సాధిస్తుందని ఆశీష్‌కుమార్ యాదవ్ ధీమా వ్యక్తం చేశారు.

అలరించిన పౌరాణిక పద్యనాటక ప్రదర్శన

సుల్తాన్‌బజార్: తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో దసరా నవరాత్రి ఉత్సవాల సందర్భంగా తెలుగురత్న వల్లూరి శ్రీహరిరావు కళాసేవలో పౌరాణిక పద్యనాటక ప్రదర్శనను నిర్వహించారు. చిలకమర్తి లక్ష్మీనరసింహా వ్యాయోపాఖ్యానం పద్యనాటం జరిగింది. శ్రీకృష్ణుడిగా వల్లూరి హరిరావు, అర్జునుడిగా అంజిరెడ్డి, గాయుడిగా తిరుపతయ్య, నారదుడిగా వెంకటేశ్వర్‌రావు, సుభద్రగా సూర్యకుమారి, అంకురగా సాయిబాబులు నటించారు. విశిష్ట అతిథులుగా గనులు, భూగర్భశాఖ రిటైర్డ్ డైరెక్టర్ రాజ్‌గోపాల్, కృష్ణారెడ్డి, బండారు సుబ్బారావు, మూర్తి, శ్రీనివాసరావు, చక్రపాణి తదితరులు పాల్గొన్నారు.

ప్రయాణికులకు ఆర్టీసీ దసరా కానుక

అఫ్జల్‌గంజ్: బతుకమ్మ, దసరా పండుగలను పురస్కరించుకొని టీఎస్ఆర్టీసీ బుధవారం నుంచి లక్కీడిప్ స్కీంను ప్రవేశపెట్టినట్లు రంగారెడ్డి రీజనల్ మేనేజర్ శ్రీధర్ తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా నిర్వహిస్తున్న ఈ లక్కీడిప్‌లో భాగంగా మహాత్మాగాంధీ బస్‌స్టేషన్‌లో కూడా ఈనెల 30 వరకు కొనసాగుతుందన్నారు. బస్సుల్లో ప్రయాణం పూర్తయ్యాక టికెట్ వెనకాల ప్రయాణికుల పేరు, వారి ఫోన్ నెంబర్ రాసి బస్టాండ్‌లో మహిళలు, పురుషుల కోసం వేర్వేరుగా ఏర్పాటు చేసిన డ్రాప్ బాక్సుల్లో వేయాలని సూచించారు. ప్రతి రీజియన్‌కు ఐదుగురు మహిళలు, ఐదుగురు పురుషుల చొప్పున మొత్తం 110 మందికి ఒక్కొక్కరికీ రూ.9900 చొప్పున నగదు బహుమతి అందించనున్నట్లు తెలిపారు. ప్రయాణికులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

గృహిణి ఆత్మహత్య

చాంద్రాయణగుట్ట: గృహిణి ఆత్మహత్య చేసుకున్న ఘటన చాంద్రాయణగుట్ట పోలీస్‌స్టేషన్ పరిధిలో బుధవారం మధ్యాహ్నం చోటు చేసుకుంది. ఎస్సై శ్రీనివాస్ తెలిపిన వివరాల ప్రకారం..ఉప్పుగూడ నసీబ్‌నగర్‌కు చెందిన నిలోఫర్ బేగం (34), మీర్ దస్తగిరి అలీ దంపతులు. వీరికి నలుగురు పిల్లలు ఉన్నారు. బుధవారం మధ్యాహ్నం 3 గంటలకు భర్త ఇంట్లో లేని సమయంలో నిలోఫర్ ఫ్యాన్‌కు చీరతో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకుంది. గమనించిన కుటుంబసభ్యులు పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని మృతదేహాన్ని స్వాధీనం చేసుకొని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. ఆత్మహత్యకు గల కారణాలు ఇంకా తెలియరాలేదని పోలీసులు తెలిపారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

విశేష అలంకరణలు.. ప్రత్యేక పూజలు



పూజల్లో మధుసూదన్ గౌడ్ దంపతులు

దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. భక్తులు అమ్మవార్లను రోజుకో రూపంలో అలంకరించి ప్రత్యేక పూజలు చేస్తున్నారు. పలు ప్రాంతాల్లో మహిళలు ఉత్సాహంగా దాండియా ఆడుతున్నారు. మరికొన్ని ప్రాంతాల్లో మాతకా విశాల్ జాగరణ్ నిర్వహిస్తూ అమ్మవారి మండపాల వద్ద భక్తి గీతాలు ఆలపిస్తున్నారు.

– అబిడ్స్, చార్మినార్, మెహిదీపట్నం జోన్ల బృందం



అమ్మవారిని దర్శించుకున్న కైలాస్, కె.ఎస్.ఆనంద్‌రావు తదితరులు



బోజగుట్టలో.. దేవర శ్రీనివాస్ తదితరులు



జియాగూడ మాతా జాగరణలో..



దసరా రామాయణ్ మేళా కవి సమ్మేళనంలో గీతాలు ఆలాపిస్తున్న గోవింద్‌రాఠి



మహాలక్ష్మి అలంకరణలో జమ్మిచెట్టు దుర్గామాత



లలిత త్రిపుర సుందరీ దేవీగా మీరాలంమండి అమ్మవారు



గుడిమల్కాపూర్‌లో అన్నపూర్ణదేవి అలంకరణలో..



ఇస్సామియా బజార్‌లో..పూజలు చేస్తున్న శ్రీధర్‌రావు తదితరులు

అబ్దుల్ కలాంను ఆదర్శంగా తీసుకోవాలి

గన్‌ఫౌండ్రీ: నేటి యువత అబ్దుల్ కలాంను ఆదర్శంగా తీసుకోవాలని తెలంగాణ శాసనమండలి డిప్యూటీ చైర్మన్ బండా ప్రకాష్ ముదిరాజ్ తెలిపారు. బుధవారం రవీంద్రభారతిలో మెగా సిటీ నవకళావేదిక ఆధ్వర్యంలో భారతరత్న డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం 92వ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ రంగాల్లో సేవలందిస్తున్న పలువురికి పురస్కారాలను అందజేశారు. అంతకు ముందు చిన్నారుల సాంస్కృతిక నృత్య ప్రదర్శనలు ఆహూతులను ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర బీసీ కమిషన్ చైర్మన్ వకులాభరణం కృష్ణమోహన్‌రావు సరస్వతి ఉపాసకులు దైవాజ్ఞశర్మ, ప్రముఖ వైద్య నిపుణులు డాక్టర్ ఆశీష్ చౌహాన్, వేదిక వ్యవస్థాపకులు మల్లికార్జున్ రావు, రాఘవ పాల్గొన్నారు.



ఆహ్వానం



చార్మినార్: లాల్‌దర్వాజ సింహవాహినీ ఆలయంలో జరిగే పూజా కార్యక్రమాల్లో పాల్గొనాలని బీఆర్ఎస్ నాయకుడు దాసోజు శ్రావణ్‌కుమార్‌ను కలిసి ఆలయ కమిటీ మాజీ అధ్యక్షుడు తిరుపతి నర్సింగ్‌రావు ఆహ్వానించారు. ప్రతి బోనాల జాతర ఉత్సవాల్లో లాగే దసరా శరన్నవరాత్రి వేడుకలను వైభవంగా నిర్వహిస్తామని.. ఈ వేడుకల్లో తప్పనిసరిగా పాల్గొనాలని ఆయన శ్రావణ్‌కుమార్‌ను కోరారు.

బతుకమ్మ సంబరాలు



వేడుకల్లో మెథడిస్ట్ అధ్యాపకులు, ఉపాధ్యాయులు

అబిడ్స్: అబిడ్స్‌లోని మెథడిస్ట్ ఇంజనీరింగ్ కళాశాలలో బతుకమ్మ ఉత్సవాలు కనుల పండువగా నిర్వహించారు. తెలంగాణ సంస్కృతిని, సంప్రదాయాలను చాటేవిధంగా కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు సాంప్రదాయ దుస్తులు ధరించి బతుకమ్మలను ఆడారు. బతుకమ్మ ఆటపాటలతో కళాశాల హోరెత్తింది. అధ్యాపకులు, విద్యార్థినులు పలు నృత్యాలు చేస్తూ దాండియా తరహాలో బతుకమ్మ ఆటలు ఆడారు.

వాహనాల తనిఖీల్లో రూ.3 లక్షల స్వాధీనం

నాంపల్లి: వాహనాల తనిఖీల్లో భాగంగా హబీబ్‌నగర్ పోలీసులు బుధవారం రాత్రి ఓ వ్యక్తి నుంచి రూ.3 లక్షలు నగదును స్వాధీనం చేసుకున్నారు. ఈ ఘటన ఆగాపురాలోని హమీద్ కేఫ్ వద్ద చోటు చేసుకుంది. ఇన్‌స్పెక్టర్ టంగుటూరి రాంబాబు తెలిపిన వివరాల ప్రకారం..మంగళ్‌హాట్‌కు చెందిన వికాస్‌రాజ్ అనే వ్యక్తి యాక్టివాపై వెళ్తున్నాడు. అదే సమయంలో వాహనాలు తనిఖీలు చేసుకుండగా అతడి బైక్‌ను ఆపి సోదాలు చేశారు. అయితే బైక్ డిక్కీలో రూ.3 లక్షలు నగదు కనిపించిందని తెలిపారు. డబ్బుకు సంబంధించిన ఎలాంటి ఆధారాలు, పత్రాలు లేకపోవడంతో అతడి వద్ద ఉన్న నగదును సీజ్ చేశామన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

వంద శాతం పోలింగ్ జరిగేలా కృషి



చార్మినార్: ప్రశాంతమైన వాతావరణంలో వంద శాతం పోలింగ్ జరిగేటట్లు ఎన్నికల అధికారులతో కలిసి తాము కృషి చేస్తున్నామని దక్షిణ మండలం డీసీపీ సాయి చైతన్య తెలిపారు. మీర్‌చౌక్ అసిస్టెంట్ పోలీసు కమిషనర్ వెంకటేశ్వర్‌రావు ఆధ్వర్యంలో బుధవారం యాకుత్‌పురాలోని క్రిస్టల్ కన్వెన్షన్‌లో జరిగిన మీర్‌చౌక్ డివిజన్‌లోని రౌడీషీటర్ల కౌన్సెలింగ్ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. రౌడీషీటర్లకు కొన్ని సలహాలు, సూచనలతో పాటు హెచ్చరికలు జారీ చేశారు. ఇప్పటికే అవసరమైన మేరకు బైండోవర్ కార్యక్రమాలను చురుకుగా కొనసాగిస్తున్నామన్నారు. స్వార్థపర రాజకీయ నాయకుల పంచన చేరి శాంతి భద్రతలకు విఘాతం కలిగించాలని చూస్తే చూస్తూ ఊరుకునే పరిస్థితులు లేవన్నారు. ఈ కార్యక్రమంలో దక్షిణ మండలం అదనపు డీసీపీ షేక్ జహంగీర్, మీర్‌చౌక్, రెయిన్‌బజార్, భవానీనగర్ పోలీసు స్టేషన్లకు చెందిన ఇన్‌స్పెక్టర్లు పాల్గొన్నారు.

అబిడ్స్‌లో రౌడీషీటర్ల బైండోవర్



కౌన్సెలింగ్ ఇస్తున్న ఇన్‌స్పెక్టర్

అబిడ్స్: అబిడ్స్ పోలీస్‌స్టేషన్ పరిధిలో రౌడీషీటర్లకు ఇన్‌స్పెక్టర్ నర్సింహారాజు ఆధ్వర్యంలో బైండోవర్ చేశారు. ముందుగా రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ నిర్వహించారు. ఎన్నికల నిబంధనల ప్రకారం..అభ్యర్థుల వెంట తిరిగినా, ఎన్నికల అభ్యర్థులతో తిరిగినా, ఇతర ఎలాంటి అక్రమ పనులు చేసినా కఠినంగా వ్యవహరిస్తామని హెచ్చరించారు. రౌడీషీటర్లకు పోలీసులు కఠిన తరహా హెచ్చరికలు జారీ చేసి పంపించారు. నిబంధనలను ఉల్లంఘిస్తే జైలుకే అని ఆయన అన్నారు.

రామారావుకు రజత పతకం



రామారావుకు రజత పతకాన్ని అందజేస్తున్న డాక్టర్ కేవీ రమణాచారి

నాంపల్లి: సామాజిక మాధ్యమాలలో లేదా టీవీ మీడియాలో చేసే వ్యాఖ్యానం, విశ్లేషణలలో మాట్లాడే అంశాలపై పూర్తి అవగాహన ప్రధానమని ప్రభుత్వ సలహాదారు కేవీ రమణాచారి అన్నారు. బుధవారం మాసబ్‌ట్యాంక్‌లోని నఫీజ్ రెసిడెన్సీలోని గాయత్రీ సదనంలో ప్రముఖ మహిళా సాంస్కృతిక సేవా సంస్థ రాగ సప్తస్వరం నిర్వహణలో అక్కినేని శత జయంతి వేడుకలను పురస్కరించుకుని ప్రఖ్యాత సినీ రాజకీయ విశ్లేషకుడు ఇ.రామారావుకు అక్కినేని రాగ సప్తస్వర మానేపల్లి జువెలర్స్ రజత పతకం ప్రదానోత్సవం సభ జరిగింది. ముఖ్యఅతిథిగా కేవీ రమణాచారి హాజరై రజత పతకాన్ని అందజేసి ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో సంస్థ స్థాపకురాలు రాజ్యలక్ష్మి, కార్యదర్శి అహల్య, సహాయ కార్యదర్శి సుందరవల్లి తదితరులు పాల్గొన్నారు. సభా ప్రారంభంలో రవికుమార్, సిరి స్పందన, సుబ్బులక్ష్మి ఆలపించిన శాస్త్రీయ భక్తి గీతాలు ఆకట్టుకున్నాయి.

కత్తితో సంచరిస్తున్న వ్యక్తికి జైలు

గౌలిపురా: కత్తితో అనుమానాస్పదంగా సంచరిస్తున్న ఓ వ్యక్తిని నాంపల్లిలోని 4వ స్పెషల్ మెట్రో పాలిటన్ కోర్టు మెజిస్ట్రేట్ (ఇన్‌చార్జి) లలిత 6 రోజుల జైలు శిక్ష, రూ.300 జరిమానా విధిస్తూ తీర్పునిచ్చారు. ఇన్‌స్పెక్టర్ రవీందర్ తెలిపిన వివరాల ప్రకారం..చంచల్‌గూడ ప్రాంతానికి చెందిన షేక్ మహమ్మద్ (22) ఈనెల 15న భవానీనగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని తలాబ్‌కట్టా ప్రాంతంలో కత్తితో అనుమానాస్పదంగా సంచరిస్తుండగా అనుమానం వచ్చి అదుపులోకి తీసుకున్నారు. దీనిపై భవానీనగర్ పోలీసులు నిందితునిపై కేసు నమోదు చేసుకొని బుధవారం నాంపల్లిలోని 4వ స్పెషల్ మెట్రో పాలిటన్ కోర్టులో హాజరుపరచగా పూర్వపరాలను పరిశీలించిన మెజిస్ట్రేట్ (ఇన్‌చార్జి) లలిత నిందితుడు షేక్ మహమ్మద్ 6 రోజుల జైలు శిక్ష, రూ.300 జరిమానా విధిస్తూ తీర్పునిచ్చారు.